సాక్షి
మంచిర్యాల

బుధవారం । 1 । నవంబర్ । 2023



లెక్క దాటితే చిక్కే!

నామినేషన్ తర్వాత అభ్యర్థులు వెచ్చించే ప్రతి పైసాను ఎన్నికల పరిశీలకులు లెక్కిస్తారు. పరిమితికి మించి ఖర్చు చేస్తే అభ్యర్థులపై వేటు వేసే ప్రమాదముంది. 10లో▸

'నిబంధనలు పాటించాలి'

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జీ సంతోష్ ఓ ప్రకటనలో తెలిపారు. నామినేషన్ దాఖలు సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సహా య. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల వ్యాసార్థం లోపు అభ్యర్థితోసహా ఐదుగురికే అనుమతి ఉందని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0 /21.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

చెన్నూర్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పీవో, ఏపీవో, సెక్టోరల్ ఆఫీసర్లకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని 743 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో మైక్రోఅబ్జర్వర్లు, మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో 330 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గ ఎన్నికలాధికారి సిడాం దత్తు, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏనుగెక్కిన 'దాసారపు'



శ్రీనివాస్‌ను బీఎస్పీలోకి ఆహ్వానిస్తున్న ఆర్‌ఎస్పీ, పక్కన ఎంపీ గుణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: టీపీసీసీ డాక్టర్స్ సెల్ వైస్‌చైర్మన్ దాసారపు శ్రీనివాస్ బీఎస్పీలో చేరారు. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ సమక్షంలో కండువా కప్పుకొన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ వైద్యవృత్తిలో ఉంటూ 2014 నుంచి కాంగ్రెస్‌లో పని చేస్తున్నారు. గతంలో రెండుసార్లు చెన్నూరు నుంచి టికెట్ ఆశించారు. తాజాగా ఆయన సతీమణి డాక్టర్ విద్యావర్ధిని కూడా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి కూడా టికెట్ దక్కకపోవడంతో నిరాశతో ఉన్నారు. చివరకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో ఉన్న సంబంధాలతో బీఎస్పీలో చేరారు. చెన్నూరు నుంచి పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

ముగిసిన పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాలు



విద్యార్థులతో కమాండెంట్ జమీల్‌భాషా, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, సిబ్బంది


మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సమైక్యతను ప్రదర్శించాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కమాండెంట్ జమీల్‌భాషా పటేల్ సేవలను కొనియాడారు. గుడిపేట మౌంట్ కార్మల్ పాఠశాల విద్యార్థులతో కలిసి బెటాలియన్ నుంచి గుడిపేట జాతీయ రహదారిలో జాతీయ సమైక్యత దినోత్సవ ఏక్తా దివస్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, డిస్పెన్సరీ వైద్యులు శ్రీధర్, సంతోష్ సింగ్, ఆర్‌ఐలు కుమారస్వామి, మారుతి, శ్రీనివాస్, గోపి, రవి, ఉద్ధవ్, ఆర్‌ఎస్సైలు, బెటాలియన్ మినిస్టీరియల్, సిబ్బంది ఉన్నారు.

సామర్థ్యాలపై సర్వేకు సన్నద్ధం

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్–2023కు అధికారులు సమాయత్తమవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థుల సామర్థ్యాలు, బోధనాపద్ధతులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అమలు చేస్తున్న వ్యూహాలను స్పష్టంగా తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా నవంబర్ 3న అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 392 పాఠశాలల్లో 586 సెక్షన్‌లో సర్వే నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయిలో పేపర్ల ముద్రణ నుంచి పరిశీలకుల నియామకం వరకు ప్రణాళికతో విద్యాశాఖ సిద్ధమైంది. ఓఎంఆర్ ఆధారితంగా పరీక్ష నిర్వహించనున్నారు. సర్వేలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఇంటర్ వి ద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో సర్వే నిర్వహించి పరీక్షాపత్రాలు మండల కో ఆర్డినేటర్లు, అక్కడి నుంచి జిల్లా అధికారుల కు అందించనున్నారు. జిల్లా కోఆర్డినేటర్లుగా డీఈవో యాదయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దామోదర్‌రావు, జిల్లా అసోసియేట్ కో ఆర్డినేటర్లు, సమగ్రశిక్ష కో ఆర్డినేటర్లుగా చౌది, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, రాజ్‌కుమార్, మండల కో ఆర్డినేటర్లుగా ఎంఈవో, గజిటెడ్ హెచ్‌ఎంలు వ్యవహరించనున్నారని డీఈవో తెలిపారు.

కండువాలు మారుతున్నాయ్ !

- రాజకీయ పార్టీల్లో చేరికలజోరు
- ఎన్నికల వేళ పెరిగిన వలసలు
- అసంతృప్తులకు పార్టీల గాలం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల కండువాలు వేగంగా మారుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో తమ బలం పెంచుకునేందుకు పోటాపోటీగా పార్టీలు చేరికల్ని ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం వివిధ పార్టీల్లోకి వలసలు జోరందుకున్నాయి. ఆయా పార్టీల్లో అసంతృప్త నాయకులు అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు గోడ దూకేస్తున్నారు. జిల్లాలో నియోజకవర్గ స్థాయి నాయకుల నుంచి పట్టణ, మండల, గ్రామ స్థాయిలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి చేరిపోతున్నారు. బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆయా పార్టీలు అసంతృప్తులకు గాలం వేసి వలసలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ (జన్నారం) పరిధిలో వారం రోజులుగా నాయకుల రోజువారీ ఎన్నికల దినచర్యలో చేరికలు ప్రధానంగా మారాయి.

అధికార, ప్రతిపక్షాల్లోనే పోటీ

అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీల మధ్యే చేరికలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఇన్నాళ్లు ఓ పార్టీలో పని చేసిన వారంతా స్థానిక నాయకత్వంపై అసంతృప్తి, పార్టీలో తగిన గుర్తింపు దక్కని నేతలంతా సమయం చూసి కండువా మార్చేస్తున్నారు. ఇదే అదనుగా అసంతృప్తులు ఎక్కడ ఉన్నారో గుర్తించి ప్రత్యర్థి పార్టీ నాయకులు తమ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానం పలుకుతున్నారు. దీంతో అన్నీ సరి చూసుకుని నచ్చిన పార్టీలోకి వెళ్లిపోతున్నారు. ఇక కొందరైతే వారం, పది రోజుల్లోనే రెండు పార్టీల్లో అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు మారుతున్నారు. మారుతున్న పరిస్థితులతో గతంలో ఉన్న పార్టీతో సంబంధాలు తెంపుకొని వస్తున్నారు. అయితే మళ్లీ బుజ్జగించడంతో కొందరు వెనక్కి కూడా వస్తున్నారు. దీంతో ఎవరు నిజంగా పార్టీపై అభిమానంతో వస్తున్నారో.. లేదో తెలుసుకోలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల దండేపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి మండలాల్లో వారం వ్యవధిలోనే రెండు పార్టీలు మారిన నాయకులున్నారు.

హామీలు, ప్రలోభాలు

అన్ని రాజకీయ పార్టీలు ద్వితీయ శ్రేణి నాయకత్వంపై దృష్టి పెట్టి ప్రత్యేకంగా చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఓట్లు వేయించే పరపతి ఉన్న నాయకులను ఎంచుకుని తమ వైపు తిప్పుకొంటున్నాయి. గ్రామ స్థాయి మొదలు.. జిల్లా స్థాయి వరకు ప్రజల్లో పలుకుబడి ఉండి, కాస్త పేరున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. నాయకులు తమ పార్టీలోకి చేరేందుకు అందుకు తగిన హామీలు ఇస్తూ.. ప్రలోభాలకు గురి చేస్తున్నారు. కింది స్థాయి నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని చెప్పడంతో పాటు ఇతర ప్రలోభాలకు గురి చేస్తున్నారు. మహిళలు, రైతులు, యువజన, కుల సంఘాల నాయకులు తదితర వర్గాలకు పలు రకాలుగా హామీలు ఇస్తున్నారు. దీంతో పార్టీకి ఆకర్షితులైన వారు కండువాలు మార్చుకుంటున్నారు. అయితే ముందునుంచి ఉన్న కార్యకర్తలు, కొత్తగా చేరే వారి మధ్య ఆధిపత్య పోరు కూడా కొన్ని చోట్ల మొదలవుతోంది.

వివేక్ మారితే మరిన్ని చేరికలు

మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు గడ్డం వివేక్ వెంకటస్వామి పార్టీ మారితే ఆయన వెంట భారీగా కార్యకర్తలు, నాయకులు వెళ్లనున్నారు. అదే సమయంలో ఆయన రాకతో ఇబ్బంది పడే వారంతా కూడా మరో పార్టీలో చేరే అవకాశం ఉంది. చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో అనుచర వర్గం ఆయన వెంట నడిచే అవకాశం ఉంది.

ఒట్టేసి చెబుతున్న ఇక్కడే ఉంటా..

- మాజీ మంత్రి గడ్డం వినోద్



నందులపల్లిలో కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో గడ్డం వినోద్

నెన్నెల: 'నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే బెల్లంపల్లిలోనే ఉంటా.. నాన్న మీద ఒట్టేసి చెబుతున్న.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతా..' అని మాజీ మంత్రి, కాంగ్రెస్ బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ హామీ ఇచ్చారు. మంగళవారం నందులపల్లి, గొల్లపల్లి, గంగారాం, కొత్తూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రచారసభల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తనను ఆశీర్వదించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమెరికాలో ఉండే తన కూతురు తనతో పాటే బెల్లంపల్లిలో ఉండి ప్రచారంలో పాల్గొంటుందని, నియోజకవర్గ మహిళలు ఆమెను నేరుగా బెల్లంపల్లిలో ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పుకోవచ్చని తెలిపారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిధులతోపాటు సొంత డబ్బులు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మాటిచ్చారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. నందులపల్లిలో గజేందర్‌సింగ్ ఆధ్వర్యంలో 100మంది, గొల్లపల్లి, కొత్తూర్, గంగారాం గ్రామాల నుంచి వివిధ పార్టీల కార్యకర్తలు 300మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి వినోద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు సూరిబాబు, కారుకూరి రాంచందర్, గట్టు మల్లేశ్, బాదం రమేశ్, ఎయ్యాల మల్లిక, గట్టు బానేశ్, గోవింద్ సింగ్, మొహిద్‌ఖాన్ పాల్గొన్నారు.

'నియమావళిపై అవగాహన పెంచుకోవాలి'



అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సంతోష్, ఆర్వో రాహుల్

బెల్లంపల్లి: ఎన్నికల నిర్వహణ, ప్రవర్తన నియమావళి అమలుపై ఎన్నికల అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మంగళవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి మొదటి విడత శిక్షణ తరగతులు ప్రారంభించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తమకు అందజేసిన హ్యాండ్‌బుక్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, పోలింగ్‌రోజు ఈవీఎంలలో ఏవైన సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించడానికి అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఫారం 12డీ, పోస్టల్ ఓట్ల ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరుపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఫాంలు నింపే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికలాధికారులు పాల్గొన్నారు.

'శ్రీదేవి టికెట్ రద్దు చేయకుంటే దీక్ష'



పాత బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఏమాజీ వర్గీయులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి అభ్యర్థిత్వాన్ని అధిష్టానం వెంటనే రద్దు చేయకుంటే ఆమరణ దీక్ష చేపడతానని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ హెచ్చరించారు. మంగళవారం బెల్లంపల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. అంతకుముందు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. శ్రీదేవి టికెట్ రద్దు చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా పార్టీ విస్తరణకు పాటుపడినా పట్టించుకోకుండా శ్రీదేవికి టికెట్ ఖరారు చేయడం దారుణమన్నారు. బీజేపీని నియోజకవర్గంలో పటిష్టం చేయడానికి తాను కృషి చేశానని చెప్పారు. తనను కాదని శ్రీదేవికి ఏ అర్హతతో టికెట్ కేటాయించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఏమాజీకి టికెట్ ఇచ్చే దాకా ఆందోళనలు చేస్తామని నాయకులు తెలిపారు. నాయకులు కేశవరెడ్డి ప్రకాశ్, ప్రభాకర్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్, సత్యనారాయణరెడ్డి, గట్టయ్య, సుభాష్, ప్రవీణ్‌కుమార్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

'మావోయిస్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా'

మంచిర్యాలక్రైం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని 'మావో' ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్, ఎస్‌ఐబీ ఐజీ ప్రభాకర్‌రావ్ పేర్కొన్నారు. ఎన్నికల్లో భాగంగా మంగళవారం రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు మావోయిస్టులు, మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిరంతరం కూంబింగ్, స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ దళాలతో నిరంతరం నిఘా నిర్వహణ కొనసాగించాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు భద్రత పెంపు, పీఎస్‌వోలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అక్రమ రవాణా, మద్యం, డబ్బు రవాణాను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓట్లు వేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీసీపీలు సుధీర్‌రాంనాథ్‌కేకన్, చేతన, ఏసీపీలు, సీలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సంతోష్



సిబ్బందితో ప్రతిజ్ఞ చేస్తున్న డీటీవో కిష్టయ్య, ఎంవీఐ రాహుల్

- జయంతి వేడుకల్లో కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన ఉక్కుమనిషి, దేశ ప్రజలంతా ఒక్కటేనని ప్రజలందరినీ ఏకతాటిపై నిలిపిన మహామనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కలెక్టర్ బీ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రియ విద్యాలయం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జెడ్పీ బాలుర హైస్కూల్ వరకు తలపెట్టిన 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను కొనియాడారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ డీడీ దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, సీపీవో సత్యంతో కలిసి దేశ సమగ్రత, సమైక్యత, అంతర్గత భద్రతను కాపాడుతామని దేశాభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

రవాణాశాఖ కార్యాలయంలో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సమైక్యతను ప్రదర్శించాలని రవాణాశాఖ సిబ్బంది పలువురు వాహనదారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. డీటీవో కిష్టయ్య, ఎంవీఐ రాహుల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

డంప్‌యార్డు తరలించాల్సిందే..

- ఆండాళమ్మ కాలనీ ప్రజల డిమాండ్
- దుర్గంధం, పొగ వస్తోందని ఆవేదన
- రోగాల పాలవుతున్నామని ఆగ్రహం
- 'సాక్షి' ప్రజా ఎజెండాకు స్పందన



ఆండాళమ్మ కాలనీలోని డంప్‌యార్డు



'సాక్షి' ప్రజా ఎజెండాలో మాట్లాడుతున్న కాలనీవాసులు

ప్రజా ఎజెండా

మంచిర్యాలటౌన్: డంప్‌యార్డు కారణంగా జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్గంధం, పొగ వ్యాపిస్తుండడంతో ఇళ్లల్లో ఉండలేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తంజేస్తున్నారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఎజెండాలో కాలనీవాసులు డంప్‌యార్డు కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలు ఏకరువు పెట్టారు. కాగా, జిల్లా కేంద్రంలో సేకరించిన చెత్తను కొన్నేళ్లుగా పట్టణ శివారులోని మున్సిపల్ ఖాళీ స్థలంలో డంపు చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఎలాంటి కాలనీ లేకపోవడంతో ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. పట్టణ శివారు ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఈ ప్రాంతంలోనూ ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమేణా ఇక్కడ ఆండాళమ్మ కాలనీ ఏర్పడింది. మున్సిపల్ పరిధిలో నిత్యం 40 మెట్రిక్ టన్నుల కంటే అధికంగా చెత్త సేకరిస్తున్నారు. ఈ చెత్తనంతా ఇక్కడి డంప్‌యార్డులో వేస్తున్నారు. దీంతో చెత్త గుట్టలుగుట్టలుగా పేరుకుపోతోంది. గతంలో తడి, పొడి చెత్త వేరుచేసి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు ఏర్పాట్లు చేసినా.. ఆ తరువాత ఎవరూ పట్టించుకోలేదు.

దుర్గంధం, పొగతో శ్వాసకోశ వ్యాధులు

డంప్‌యార్డులో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త నుంచి దుర్గంధం వ్యాపిస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. చెత్తను ఇక్కడే కాల్చి వేస్తుండగా ఇళ్లలోకి పొగ వస్తోందని చెబుతున్నారు. ప్రధానంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతోంది. భరించలేని స్థితిలో కాలనీవాసులు వారంపాటు చెత్త డంపు చేయకుండా అడ్డుకుని ఆందోళనకు దిగారు. దీంతో మున్సిపల్ అధికారులు రెండు నెలల్లో డంప్‌యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

ఐదు నెలలైనా తరలింపేది?

అధికారులు హామీ ఇచ్చి ఐదు నెలలైనా డంప్‌యార్డు తరలించలేదు. దీంతో కాలనీవాసులు అవే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నస్పూరు మున్సిపాలిటీ పరిధిలో చెత్త వేశారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ శివారులో కొద్దిరోజుల పాటు చెత్త డంపు చేశారు. ప్రస్తుతం హాజీపూర్ మండలం ముల్కల్ల పంచాయతీ పరిధిలో నాలుగెకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినా.. ఇప్పటికీ డంప్‌యార్డును తరలించే ఏర్పాట్లు మాత్రం చేయడం లేదు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఆండాళమ్మ కాలనీవాసుల పోరాటం ఏళ్లు గడిచినా ఫలించడంలేదు. ఇప్పటికైనా డంప్‌యార్డు తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బయట కూర్చుంటలేం



పనులకు వెళ్లి వచ్చినంక ఇంటి బయట కూర్చోలేక పోతున్నం. ఇంట్లో ఉన్నా దుర్వాంధం వ్యాపిస్తోంది. అన్నం కూడా తినలేని పరిస్థితి మాది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దుర్గంధం, పొగతో చాలా ఇబ్బందులు పడుతున్నం. సార్లు ఇప్పటికైనా డంప్‌యార్డు వేరే ప్రాంతానికి తరలించాలె.

– రాధ

మా బాధలు వింటలేరు



కాలనీవాసులమంతా డంప్‌యార్డు తొలగించాలని ఏళ్లుగా పోరాడుతున్నం. మా బాధలు ఎవరూ పట్టించుకుంటలేరు. చెత్త వాహనాలు ఇక్కడికి రాకుండా అడ్డుకుంటే అధికారులు వచ్చి సమస్య పరిష్కరిస్తమని హామీ ఇచ్చి ఆ తర్వాత పట్టించుకుంటలేరు. ఇప్పటికైనా డంప్‌యార్డు తొలగించాలె.

– మహ్మద్ అజీజ్

వెంటనే తరలించాలె



ఆండాళమ్మ కాలనీ నుంచి డంప్‌యార్డును వేరేచోటుకు తరలించాలని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నం. అధికారులు ఇతర ప్రాంతాల్లో స్థలాలు గుర్తిస్తున్నట్లు తెలిపిన్రు. కొన్నాళ్లు వేరేచోటుకు చెత్త తరలించి ఆ తరువాత తిరిగి మా కాలనీలోనే వేస్తున్నరు. వెంటనే డంప్‌యార్డు తరలించాలె.

– బాబురావు

భరించలేకపోతున్నం



డంప్‌యార్డును మా కాలనీ నుంచి తరలిస్తున్నమని సార్లు చెప్పిన్రు. కొద్దిరోజులు వేరేచోటుకు చెత్త తరలించిన్రు. కొద్దిరోజులకే మళ్లీ తిరిగి వచ్చి ఆండాళమ్మ కాలనీలోనే చెత్త వేస్తున్నరు. దుర్గంధం భరించలేకపోతున్నం. పూర్తిస్థాయిలో మా కాలనీ నుంచి డంప్‌యార్డు తొలగించాలె.

– కొమురయ్య

ఊపిరాడడంలేదు



డంప్‌యార్డు నుంచి వెలువడే దుర్గంధం కారణంగా ఏడాదంతా మా కాలనీలోని పిల్లల నుంచి పెద్దల వరకు రోగాల బారిన పడుతున్నం. డంప్‌యార్డులో గుట్టలుగా చెత్త పేరుకుపోతుండగా కాల్చివేస్తున్నరు. దీంతో పొగ ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. ఒక్కోసారి ఊపిరాడడంలేదు.

– లక్ష్మి

ఏళ్లుగా కొట్లాడుతున్నా..



మా కాలనీలో డంప్‌యార్డు తీసేయాలని ఎన్నో ఏళ్లుగా కొట్లాడుతున్నం. ఆఫీసర్లు వస్తరు.. తీస్తమని చెప్పి పట్టించుకోరు. కొట్లాడి కొట్లాడి మా ఓపిక నశిస్తోంది. కానీ.. డంప్‌యార్డు మాత్రం తరలించడంలేదు. మేము ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి న్యాయం చేయాలె.

– నస్రీన్

క్లుప్తంగా

'నవోదయలో' ప్రవేశానికి గడువు పెంపు

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లోని 9, 11వ తరగతుల్లో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 7వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 2024 ఫిబ్రవరి 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ల ప్రతిపాదికన భర్తీ చేయడం జరుగుతుందని, అర్హులైన వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94412 64035 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్, ట్యాలీ, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7095780999 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఫలించిన బుజ్జగింపులు

కాసిపేట: ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై అసంతృప్తితో మండలంలోని వైస్ ఎంపీపీతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పార్టీ మారేందుకు సిద్ధపడగా అధిష్టానం చేపట్టిన బుజ్జగింపులు ఫలించాయి. ఎంపీ వెంకటేష్‌నేత, ఓసీసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రాంమోహన్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావుతో చర్చించారు. మంత్రి కేటీఆర్ వారితో ఫోన్‌లో మాట్లాడి అసంతృప్తి చెందవద్దని, మీకు మేమున్నామని, పార్టీని గెలిపించుకోవాలని సూచించారు. దీంతో నాయకులు బీఆర్ఎస్‌లో కొనసాగేందుకు అంగీకరించారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చెన్నూర్: గజ్వేల్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, పెండ్యాల లక్ష్మణ్, కొండపర్తి వెంకటరాజం, నాయిని సతీశ్, ఏలేశ్వరం నర్సింహచారి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నెన్నెల: తెలంగాణ ఎరుకల సంఘం నెన్నెల మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు, ప్రధాన కార్యదర్శి లోకిని రవి, నస్పూర్ మండల అధ్యక్షుడు కెంసారం సారయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.



లెక్క దాటితే చిక్కే!

- ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చు పక్కాగా ఉండాల్సిందే
- రూ.40 లక్షలు మించొద్దన్న ఎన్నికల సంఘం
- తర్వాత లెక్కలు సమర్పించాల్సిందే..

జంగ్ తెలంగాణ

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నెలకొంది. అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సభలు.. ర్యాలీలు.. భోజనాలు, వాహనాలు ఇలా.. ఎన్నో ఖర్చులు ఉంటాయి. ఎన్నికల రణరంగంలో పైచేయి సాధించడానికి అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిర్దేశించింది. వీటిని పక్కాగా అమలు చేయడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించింది. సభ్యులు నిత్యం పరిశీలిస్తూ ఖర్చు లెక్కిస్తారు. హద్దు దాటితే అనర్హత వేటు పడే ప్రమాదమూ ఉంది. అభ్యర్థులూ.. తస్మాత్ జాగ్రత్త.

నామినేషన్ నుంచి అమల్లోకి...

ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఎన్నికల ఖర్చు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరిచి దానిద్వారానే లావాదేవీలు నిర్వహించాలి. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు చేపట్టిన ప్రచారాలు, సభలు, ఇతర కార్యక్రమాలు సంబంధిత పార్టీల ఖర్చు కింద జమ చేస్తారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు.

లెక్క చూపకున్నా వేటే...

ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోపు ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్కరూ తమ పూర్తిస్థాయి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, వ్యయానికి సంబంధించిన లెక్కలను సరైన సమయంలో చూపకున్నా సంబంధిత వ్యక్తులపై వేటు పడటంతో పాటు తర్వాతి ఎన్నికల్లో పోటీచేసే హక్కు కోల్పోవాల్సి ఉంటుంది.

రూ.40 లక్షల వరకే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారం నిమిత్తం ఈసీఐ వ్యయ పరిమితిని రూ.40 లక్షల వరకు నిర్దేశించింది. పరిమితి దాటి ఖర్చు చేసినా, వాటికి సంబంధించిన లెక్కలను ఆధారాలతో చూపకున్నా అభ్యర్థులపై వేటు వేసేలా ఎన్నికల సంఘం నిబంధనలు ఉన్నాయి.

నిరంతరం నిఘా

నామినేషన్ తర్వాత అభ్యర్థులు చేసే ప్రతీ కార్యక్రమాన్ని పరిశీలకులు నీడలా వెంటాడుతారు.

- అభ్యర్థులు ప్రచారాలు, సభలు సమావేశాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. వాటి ప్రకారం ఆయా కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు వీడియోలు తీసుకుంటారు.
- అనంతరం వాటిని పరిశీలించి సభలు, సమావేశాలకు ఎన్ని కుర్చీలు వేశారు, ఎన్ని టెంట్లు వేశారు. ఎన్ని మైక్‌సెట్లు పెట్టారు. ఎన్ని వాహనాలు వచ్చాయి, ఎంత మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఖర్చు లెక్కించి షాడో రిజిస్టర్లో నమోదు చేస్తారు. అభ్యర్థులు కూడా పోలింగ్ నాటికి ఖర్చు వివరాలను మూడు పర్యాయాలు అకౌంటింగ్ టీంతో తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుంది.

ఆహార పదార్థాలు

లీటర్ నీటి సీసా	: రూ.20
చికెన్ బిర్యానీ	: రూ.140
మటన్ బిర్యానీ	: రూ.180
పులిహోర	: రూ.30
భోజనం	: రూ.80
సమోసా	: రూ.10
టిఫిన్	: రూ.35
చాయ్	: రూ.7

అద్దె గది

గెస్ట్ హౌస్ ఏసీ(సింగిల్)	: రూ.1,150
గెస్ట్ హౌస్ (డబుల్స్)	: రూ.1600
హోటల్స్ నాన్ఏసీ	: రూ.800
డ్రైవర్స్	: రూ.400

వాహనాల అద్దె

డీసీఎం వ్యాన్	: రూ.3,000
మినీ బస్	: రూ.3,500
ఇన్నోవా	: రూ.4,000
బస్	: రూ.6,000
జీపు	: రూ.1,200
టెంపో (ట్రావెలర్)	: రూ.2,600
సుమో, క్వాలీస్, కారు	: రూ.1,250
టవేరా	: రూ.1,575
బొలెరో	: రూ.1,450
స్కార్పియో	: రూ.1,875
ఆటో	: రూ.500

ఎన్నికల సంఘం నిర్దేశించిన అభ్యర్థుల రోజువారీ ఖర్చు వివరాలు

- మైకులు 2, ఆంప్లిఫేర్ 1, మౌత్ పీస్ : రూ.1,300
- మైకులు 12, ఆంప్లిఫేర్ 1, మౌత్ పీస్ 3 : రూ.4,200
- మినీసభ స్టేజీ, లైటింగ్, సౌండ్స్ రూ.8 వేల నుంచి రూ.12 వేలు
- వీఐపీ కుర్చీ సింగిల్ రూ.270, డబుల్ రూ.375
- టెంటు 18/36: రూ.1,500, 12/24 : రూ.800
- క్లాత్ బ్యానర్ : రూ.325 నుంచి రూ.380
- కటౌట్ ఉడెన్ : రూ.270
- క్లాత్ కటౌట్, ఆర్చ్ : రూ.1,520,
- ఫ్లెక్సీ 12/8 : రూ.1,800
- వీడియోగ్రఫీ : రూ.1,850
- డ్రోన్ కెమెరా : రూ.5,000

చెన్నూర్‌కు మంత్రుల చరిత్ర

- నాటి నుంచి నేటి వరకు ముగ్గురికి మంత్రివర్గంలో చోటు
- చెన్నూర్ నుంచి గెలిస్తే మంత్రి పదవి..!



రాజమల్లు బోడ జనార్దన్ గడ్డం వినోద్

చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి 1952 నుంచి ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరుగగా 8 మంది శాసన సభకు ఎన్నికయ్యారు. నాడు రాష్ట్రంలోనే వెనుకబడిన నియోజకవర్గంగా గుర్తింపు ఉండడంతో చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వారిలో ముగ్గురికి మంత్రివర్గంలో చోటు దక్కింది. చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందిన బోడ జనార్దన్, గడ్డం వినోద్ కార్మికశాఖ మంత్రులుగా, కోదాటి రాజమల్లు ఆరోగ్యశాఖ మంత్రిగా సేవలందించారు. అభివృద్ధిలో తమ మార్క్‌ను సొంతం చేసుకున్నారు.

కోదాటి రాజమల్లు

1962లో చెన్నూర్ ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. 1962లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కోదాటి రాజమల్లు విజయం సాధించారు. 1962 నుంచి 1972 వరకు మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన రాజమల్లు మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆయన హయాంలోనే చెన్నూర్‌లో 30 పడకల ఆస్పత్రి నిర్మించారు.

బోడ జనార్దన్

బోడ జనార్దన్ అటవీశాఖలో పనిచేస్తున్న సమయంలోనే 1985లోనే తెలుగుదేశం పార్టీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వచ్చింది. 1985 నుంచి 1999 వరకు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు మంత్రి వర్గంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు.

గడ్డం వినోద్

మాజీ ఎంపీ స్వర్గీయ గడ్డం వెంకటస్వామి తనయుడు గడ్డం వినోద్ 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి టీడీపీ అభ్యర్థి బోడ జనార్దన్‌పై విజయం సాధించారు. తెలుగుదేశం కంచుకోటలో పాగా వేసిన వినోద్‌కు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మంత్రి వర్గంలో కార్మికశాఖ మంత్రిగా అవకాశం దక్కింది. ఆయన హయాంలో చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలో 133 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి కృషి చేశారు.

'బౌండ్‌డౌన్' అంటే తెలుసా?

నెన్నెల(బెల్లంపల్లి): ఇప్పటి వరకు బైండోవర్ అంటే అందరికీ తెలుసు. బౌండ్‌డౌన్ అంటే చాలా మందికి తెలియదు. బైండోవర్ అంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి ఒప్పందం కుదుర్చుకుంటారు. అవసరమైతే ఒకరి పూచికత్తు తీసుకుని బాండ్ పేపర్ రాయించుకుంటారు. బాండ్ పేపర్‌లో పేర్కొన్న జరిమానా చెల్లించకుంటే పూచికత్తు ఇచ్చిన వారి నుంచి వసూలు చేసే వీలుంది. దీనినే బైండోవర్ చేయడం అంటారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాదు.. పండుగల సందర్భంలోనూ బైండోవర్ చేస్తుంటారు.

వర్తింపు ఇలా...

బైండోవర్ సమయంలో ఇచ్చిన మాటను అతిక్రమించడమే బౌండ్‌డౌన్. వ్యక్తిగతంగా హాజరై రాతపూర్వకంగా ఇచ్చిన హామీని మితిమీరడం అంటే చట్టాన్ని ఉల్లంఘించడమే. అయితే ఇది క్రిమినల్ కేసు కాదు. పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం లేకపోయినా ఈ విషయాన్ని తహసీల్దార్‌కు నివేదించవచ్చు. వాటికి అనుగుణంగా ఆ అధికారి చర్యలు తీసుకోవచ్చు. బైండోవర్ అయిన వ్యక్తి శిక్ష తప్పించుకునేందుకు పై కోర్టులను ఆశ్రయించవచ్చు. ఇదంతా బౌండ్‌డౌన్ చేసిన వారి వివరాలతో పోలీసులు రిపోర్ట్ చేసినప్పుడే వీలవుతుంది. కానీ చాలా సందర్భాల్లో పోలీసులు అంత వరకు వెళ్లడం లేదు.

తహసీల్దార్‌కు న్యాయపరమైన అధికారాలు

మండల రెవెన్యూ అధికారి అంటే తహసీల్దార్ అనుకుంటాం. కానీ ఆయన ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కూడా. ఆయనకు కొంతవరకు న్యాయపరమైన అధికారాలు కూడా ఉంటాయి. ఈ కారణంగా పోలీసులు బైండోవర్ చేసే సమయంలో తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు. బైండోవర్ తర్వాత ఆ వ్యక్తి ప్రవర్తనలో మార్పు రాకపోతే సమండ్లు జారీ చేసేందుకు జైలుకు పంపించే అధికారం తహసీల్దార్‌కు ఉంది. తప్పు, నేరాన్ని బట్టి బైండోవర్ సమయంలో నిర్దేశిత జరిమానా (రూ.500 నుంచి రూ.లక్ష) విధిస్తుంటారు. మొత్తాన్ని నిర్ణయించవచ్చు. వీటిని చలానా రూపంలో రాష్ట్ర ఖజానాకు చెల్లించాల్సి ఉంటుంది.



నెన్నెలలోని తహసీల్దార్ కార్యాలయం

ముహూర్తం మంచిగున్నదా..!

- నామినేషన్ ఎప్పుడు వేయాలి?
- పండితులను వాకబు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

నిర్మల్‌ఖిల్లా: నవంబర్ 3 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండడంతో ఆయా రాజకీయ పార్టీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్న వారు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గ్రామాల బాట పట్టారు. టికెట్లు ఖరారైన అభ్యర్థులంతా నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ నామినేషన్లు స్వీకరించేందుకు జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లను ఎప్పుడు వేస్తే బాగుంటుందో ముహూర్తాల కోసం పండితులను సంప్రదిస్తున్నారు. ముహూర్తం ఎప్పుడు బాగుంది? నామినేషన్ ఏ రోజు వేస్తే విజయావకాశాలు ఉంటాయో చెప్పాలని పండితులను అడుగుతున్నారు. తమకు విజయం చేకూరేలా మంచి ముహూర్తం చూడాలని కోరుతున్నారు. నవంబర్ 3, 6, 9 తేదీల్లో నామినేషన్లు వేసేందుకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు బ్రాహ్మణ పండితులు పేర్కొంటున్నారు. దీంతో ఆయా తేదీల్లోనే నామినేషన్లను దాఖలు చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

బెల్లంపల్లి: పట్టణంలో మంగళవారం ఓ బాలుని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. బెల్లంపల్లి బస్తీ ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మార్కెట్ ఏరియాకు చెందిన బాలుడు (17) గంజాయి సేవిస్తూ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అతని వద్ద 130 గ్రాముల గంజాయి లభ్యమైంది. బల్లార్షా నుంచి గంజాయిని తెచ్చి ఈప్రాంతంలో అధిక ధరకు విక్రయిస్తుండటంతో పాటు తాను కూడా సేవిస్తున్నట్లు అంగీకరించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ సమీపంలో ఊర చెరువు వద్ద మంగళవారం గంజాయి సేవిస్తూ యువకుడు పోలీసులకు పట్టుబడినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. అతని వద్ద 5 గ్రాముల గంజాయి లభించినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ అదనపు ఎస్సై హరిశేఖర్ పెట్రోలింగ్‌కు వెళ్లగా పోలీసుల వాహనాన్ని గమనించిన మల్యాల చందు అనే యువకుడు పారిపోయేందుకు యత్నించాడు. అతన్ని వెంబడించి పట్టుకోగా 5 గ్రాముల గంజాయి లభించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా దీపావళి బోనస్ ఇప్పిస్తాం



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికులకు వారం రోజుల్లోగా దీపావళి బోనస్ ఇప్పించనున్నట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో కార్మికులతో మాట్లాడారు. వారంలోగా యాజమాన్యం కార్మికులందరికీ బోనస్ చెల్లించేలా టీబీజీకేఎస్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మారిన వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశ్, నాయకులు కైత స్వామి, ఓరం కిరణ్, రామ్మోహన్, శ్యాం సుందర్, మల్లేశ్, రాజమౌళి, రాజేశం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీఎఫ్‌గా శాంతారామ్ బాధ్యతల స్వీకరణ




పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ జోన్, కాళేశ్వరం సర్కిల్‌కు సీసీఎఫ్‌గా (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఎస్.శాంతారామ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, అటవీ శాఖ అధికారులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న అటవీశాఖ అధికారులతో పాటు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో కలిసి పనిచేస్తూ అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తానన్నారు.

అత్యాచారం కేసులో ఒకరికి పదేళ్ల జైలు

మందమర్రిరూరల్(చెన్నూర్): మహిళపై అత్యాచారం కేసులో ఒకరికి పదేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మంగళవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఊరు మందమర్రికి చెందిన మహిళను 2018, జనవరి 8న మండలంలోని బురదగూడెంకు చెందిన మేకినేని కార్తీక్ పత్తిచేనులోకి లాక్కెళ్లి చంపుతానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదేరోజు బాధితురాలు మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై భాస్కర్‌రావు కేసు నమోదు చేశారు. అడిషనల్ పీపీ పులి రాయమల్లు 11 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

వైభవంగా శత లక్ష్మీనారాయణ యాగం



యాగంలో పాల్గొన్న సుమన్ దంపతులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): క్యాతనపల్లిలోని ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వగృహంలో మంగళవారం శత లక్ష్మీనారాయణ యాగం వైభవంగా నిర్వహించారు. శృంగేరి పీఠం వేదపండితులు వేదబ్రహ్మశ్రీ గోపీకృష్ణ బృందం ఆధ్వర్యంలో యాగంలో భాగంగా పూర్ణాహుతి పూజ చేశారు. సకల జనుల సంక్షేమం, అభివృద్ధి కోరుతూ పూర్ణాహుతి హోమం నిర్వహించినట్లు ఎమ్మెల్యే సుమన్ తెలిపారు.

మద్యం పట్టివేత

బెల్లంపల్లి: పట్టణంలోని శాంతిఖని బస్తీకి చెందిన మునిమంద అంకులు వద్ద మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. కాంటా ఏరియాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అంకులు వద్ద ఆఫీసర్స్ చాయిస్ 90ఎంఎల్ బాటిళ్లు 20 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గంగాపూర్ సమీపంలో మంగళవారం కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం రెబ్బెన మండల కేంద్రానికి చెందిన సయ్యద్ లతీఫ్ తన ఆటోలో గంగాపూర్‌కు ప్రయాణికులతో వెళ్తుండగా అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న గంగాపూర్‌కు చెందిన హన్మంతు, లతీఫ్, మూడేళ్ల బాలుడు రాముకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను రెబ్బెన పీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు.



గాయపడిన రాము, హన్మంతు

ఇట్యాలలో పత్తి పంట ధ్వంసం

దహెగాం: మండలంలోని ఇట్యాలలో బుద్దె గురువయ్య అనే రైతుకు చెందిన పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. గురువయ్య ఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రెండెకరాల్లో పత్తి పంటను ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పరిశీలించిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం ఇట్యాల గ్రామానికి వెళ్లి ధ్వంసమైన పత్తి పంటను పరిశీలించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు.



పత్తిపంటను పరిశీలిస్తున్న ఎస్సై సనత్‌కుమార్

ఆధార్ అవస్థలు..



ఆధార్ అప్‌డేట్‌కోసం జిల్లాలో సరిపడా కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గల ఆధార్ కేంద్రం వద్ద రోజుకు 25 నుంచి 30 మందికి మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేస్తుండడంతో పదిహేను రోజులుగా రద్దీ కొనసాగుతోంది. అదనంగా ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– దండేపల్లి(మంచిర్యాల)